క్లుప్తంగా

గాయపడిన ఉద్యోగికి పరామర్శ


కోదండన్‌ను పరామర్శిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి: ఇటీవల విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడిన ఎలక్ట్రికల్ ఉద్యోగి కోదండన్‌ను ఆదివారం పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. బుగ్గఅగ్రహారంలోని బాధితుడి ఇంటికి వెళ్లిన ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని భరోసా కల్పించారు.

యువత క్రీడల్లో ప్రతిభ చూపాలి


విజేతగా నిలిచిన అగరం కబడ్డీ జట్టు

నిండ్ర: మండలంలోని అగరం గ్రామంలో జైభీమ్ సంస్థ ఆధ్వర్యంలో సెలెక్ట్ కబడ్డీ టోర్నీ విజేతగా అగరం జట్టు నిలిచింది. పలు గ్రామాలకు చెందిన క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొన్నారు. టోర్నీ నిర్వహణకు రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా మంత్రి సోదరుడు రాంప్రసాద్ రెడ్డి రూ.10 వేలు అందించారు. శనివారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీల్లో అగరం, వెంగళత్తూరు జట్లు తలపడగా అగరం జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు ..

పాలసముద్రం: మండలంలోని బాలకృష్ణాపురం గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో నేడు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొని ప్రజలతో మమేకమవుతారని చెప్పారు. సోమవారం ఉదయం 8 గంటలకే కార్యక్రమం ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక పాల్గొనాలని కోరారు.

కరాటే బెల్ట్, సర్టిఫికెట్లు పంపిణీ


సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న మాస్టర్ రాజ్‌కోటి

నగరి: స్థానిక పీసీఎన్ స్కూల్‌లో కరాటే శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కరాటే మాస్టర్ రాజ్‌కోటి మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ ఆధారంగా బెల్ట్, సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు.

మామిడి రైతుల ఆందోళన


టి.పుత్తూరులో కాయలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

తవణంపల్లె: మామిడి కాయలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది రికార్డు స్థాయిలో మామిడి కిలో రూ.15 నుంచి ప్రారంభమై రూ.70 వరకు వ్యాపారులు, జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులు కొనుగోలు చేశారు. ఈ ఏడాది పంట దిగుబడి తక్కువగా ఉన్నా మామిడి కాయలు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. ఫ్యాక్టరీ యజమానులు కిలో మామిడి రూ.10కి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని ఫ్యాక్టరీల్లో కాయలు నిల్వ చేయడానికి స్థలం లేదని ట్రాక్టర్ లోడ్లను తిప్పి పంపుతున్నారు. ఫ్యాక్టరీ యజమానులు సిండికేట్ అవడంతో ధరలు పెరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మామిడి తోటల్లో కాయలకు మచ్చలు వచ్చి పంట దెబ్బతింటోందని వాపోతున్నారు. గిట్టు ధర కల్పించాలని కోరుతున్నారు.

సాయుధ దళ ఆత్మీయ సమావేశం



చిత్తూరు అర్బన్: పోలీసు శాఖ సాయుధ దళ 1990 బ్యాచ్ తృతీయ ఆత్మీయ సమావేశం ఆదివారం చిత్తూరులో జరిగింది. ఒకరినొకరు పలకరించుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా సాయుధ దళ ఏఆర్ ఎస్ఐ కరుణాకరన్(కంద)ను సహచర పోలీసులు ఘనంగా సన్మానించారు. కంద నిర్వహిస్తున్న సంతపేటలోని మాతృసేవా అన్నదాన ఆశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేశారు.

స్కూల్‌కు వేళాయె..

- నేడు పాఠశాలలు పునఃప్రారంభం
- ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకే స్కూళ్లు
- ఎండల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త
- నగరిలో 21460, జీడీనెల్లూరులో 18,974 మంది విద్యార్థులకు కిట్లు సిద్ధం


పుత్తూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల



విజయపురం: పంపిణీకి సిద్ధంగా విద్యాకానుక కిట్లు, పాలసముద్రం: ఎమ్మార్సీలో పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను సరి చేస్తున్న సీఆర్పీలు

వేసవి సెలవులను ఆనందంగా గడిపిన విద్యార్థులు నేడు భుజానికి బ్యాగులు తగిలించుకుని స్కూల్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా ప్రభుత్వం సమ్మర్ క్యాంపు ద్వారా క్రీడాపోటీలు నిర్వహించి ప్రోత్సహించింది. ఈసారి ప్రభుత్వం నిర్వహించిన సమ్మర్ క్యాంపు గ్రాండ్ సక్సెస్ అయిందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటికే అన్ని స్కూళ్లకు జగనన్న విద్యాకానుక కిట్లు కూడా విద్యార్థులకు తొలిరోజే పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

పుత్తూరు రూరల్ / పాలసముద్రం / విజయపురం : ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు (జూన్ 12)న యథావిధిగా పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. అయితే ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలను తీసుకుంది. మరో వారం రోజుల పాటు ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదు అవుతాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు ఉదయం పూట మాత్రమే పాఠశాలలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు చిన్న పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు ఉదయం 7.30 గంటల నుంచి 11.30 వరకు మాత్రమే తరగతులను నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

నేడు విద్యాకానుక కిట్ల పంపిణీ..

పాఠశాలలు ప్రారంభం రోజునే పండుగ వాతావరణంలో జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నగరి నియోజకవర్గంలోని నగరి, పుత్తూరు, విజయపురం, నిండ్ర, వడమాలపేట మండలల్లో మొత్తం 304 ప్రభుత్వ పాఠశాల ఉండగా అందులో 238 ప్రాథమిక, 24 యూపీ, 42 హైస్కూళ్లలో చదివే 21,460 మంది చదువుతున్నారు. విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ అందించనున్నారు. ఒక్కో కిట్‌లో 3 జతల యూనిఫాం క్లాత్ (కుట్టు కూలి సైతం చెల్లిస్తారు), జత బూట్లు, 2 జతల సాక్సులు, బెల్ట్, స్కూల్ బ్యాగు, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ఉంటాయి. ప్రతి పాఠశాలల పేరెంట్స్ కమిటీ, స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా తొలిరోజునే ప్రతి విద్యార్థికి విద్యాకానుక కిట్ అందించేందుకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సిద్ధంగా ఉన్నారు.

యథావిధిగా రాగిజావ, మధ్యాహ్న భోజనం

ఉయదం పూట మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నా రాగిజావ, మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు యథావిధిగా పంపిణీ చేయనున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి 9 గంటల వరకు రాగిజావ, అలాగే 11.30 నుంచి 12 గంటల మధ్య మధ్యాహ్నం భోజనం యథావిధిగా పంపిణీ చేసేలా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ స్కూళ్ల వైపు అడుగులు ..

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఈ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. స్కూళ్లలో లైట్లు, ఫ్యాన్లు, బెంచీలు, డిజిటల్ బోర్డు, మరుగుదొడ్లు, ఆర్‌ఓ మినరల్ వాటర్, ఇలా అన్ని వసతులు కల్పిస్తున్నారు. అంతేగాకుండా వరుసగా పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తుండడంతో పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగుతో పాటు ఇంగ్లిష్, డిజిటల్ బోధనను ప్రభుత్వం అమలు చేస్తుండంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

జీడీనెల్లూరులో..

జీడీనెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 425 ఉండగా అందులో 18,974 మంది విద్యార్థులకు పుస్తకాలతో పాటు జగనన్న విద్యాకానుకను అందించనున్నారు.

మండలం	స్కూళ్లు	విద్యార్థులు	మండలం	స్కూళ్లు	విద్యార్థులు
నగరి	89	8312	గంగాధరనెల్లూరు	104	4812
విజయపురం	45	2062	శ్రీరంగరాజపురం	64	2837
పుత్తూరు	81	6286	కార్వేటినగరం	80	3682
నిండ్ర	46	2048	వెదురుకుప్పం	81	3380
వడమాలపేట	43	2452	పెనుమూరు	63	2503
మొత్తం స్కూళ్లు	304	21460	పాలసముద్రం	33	1760



విద్యాకానుక కిట్‌లోని వస్తువులు

అన్ని స్కూళ్లకు కిట్లు పంపిణీ..


మండల కేంద్రంలో స్టాక్ చేసిన జగనన్న విద్యాకానుక కిట్లను అన్ని పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా పంపిణీ చేశాం. పాఠశాల పునఃప్రారంభం రోజే ప్రతి విద్యార్థికి ఈ కిట్ అందిస్తాం. నాడు–నేడు కింద అన్ని స్కూళ్లను అందంగా తీర్చిదిద్దాం. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పడానికి తల్లిదండ్రులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.
– ఆంజనేయులు, ఎంఈఓ, విజయపురం

ఈరోజే విద్యాకానుక పంపిణీ..


పాఠశాల పునఃప్రారంభం రోజు ప్రభుత్వం విద్యార్థుల కోసం అందించిన జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ ఏడాది అన్ని తరగతుల పుస్తకాలు వచ్చాయి. 9వ తరగతి పుస్తకాలు మారడం ద్వారా ఇంకా కొన్ని పుస్తకాలు రావలసి ఉంది. ఇప్పటికే మండలంలోని అన్ని పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశాం.
–రాజేంద్రప్రసాద్, ఎంఈఓ, పాలసముద్రం

ఈనెల 17 వరకు..


పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు పాటించాలి. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యాకానుక, రాగిజావ, మధ్యాహ్న భోజనాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలి. ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 వరకు బోధన సమయం. చివరిలో మధ్యాహ్న భోజనం అందించిన తరువాత అనంతరం పిల్లలను జాగ్రత్తగా ఇళ్లకు తీసుకెళ్లాలి. ఈనెల 17 వరకు ఉదయం పూట మాత్రమే తరగతులు జరుగుతాయి. –తిరుమలరాజు, ఎంఈఓ, పుత్తూరు

ప్రోత్సహిస్తే పిల్లలు అద్భుతాలు సృష్టిస్తారు


క్యాంపు ముగింపు సందర్భంగా కేరింతలు కొడుతున్న పిల్లలు


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ తిరుమలరాజు, లైబ్రేరియన్ మీనాకుమారి

- విజయవంతంగా సమ్మర్‌క్యాంపు ముగింపు
- ఎంఈఓ తిరుమలరాజు

పుత్తూరు రూరల్: గ్రంథాలయంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ విజయవంతం అయినట్లు ఎంఈఓ తిరుమలరాజు తెలిపారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ మాట్లాడుతూ పలువురు విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే పిల్లలు అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. ఇందుకు అనుగుణంగా తల్లిదండ్రులు తమ పిల్లల ఆలోచనా దృక్పథానికి తగ్గట్టుగా సహకరించాలని సూచించారు. సమ్మర్ క్యాంపు నేపథ్యంలో ప్రతి గ్రంథాలయంలో ప్రత్యేకంగా ఒక క్వాలిఫైడ్ టీచర్‌ను నియమించుకుని విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. క్యాంపులో కథలు చెప్పడం, పుస్తక పఠనం, డ్రాయింగ్, మెడిటేషన్, స్పోకెన్ ఇంగ్లిష్ వంటి పలు అంశాలపై పిల్లలకు శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. గత నెల 8వ తేదీన ప్రారంభమైన సమ్మర్ క్యాంపు 35 రోజుల పాటు కొనసాగడం విశేషమన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికేట్లు, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.మీనా కుమారి, టీచర్ సుధ, సిబ్బంది సుజాత తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు


బంగారు ఆభరణాలతో పాటు నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఐ అనిల్‌కుమార్

పెనుమూరు(అగ్రికల్చర్ చిత్తూరు): చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితున్ని పోలీసులు అరెస్టు చేసినట్లు ఆదివారం పెనుమూరు పోలీసులు తెలిపారు. ఎస్ఐ అనిల్‌కుమార్ వివరాల మేరకు.. గొడుగుమానుపల్లికి చెందిన చంద్రశేఖర్ శెట్టి, అతని కుమారుడు బాలాజీ ఈ నెల 1వ తేదీన ఇంటికి తాళాలు వేసుకుని బయటకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేశారు. దీనిపై అదే గ్రామానికి చెందిన భూపతి(20)అనే యువకుడిపై బాధితులకు అనుమానం రావడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు స్టేషన్‌లో విచారించగా ఈ దొంగతనం తానే చేసినట్లు నిందితుడు భూపతి ఒప్పుకున్నాడు. అతనితో పాటు ఓ మైనర్ బాలుడు కూడా ఉన్నాడని, ఇద్దరం కలిసి చంద్రశేఖర్‌శెట్టి ఇంటిలో 70 గ్రాముల బంగారం, 550 గ్రాములు వెండి వస్తువులను అపహరించినట్లు అంగీకరించడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న గ్రంథాలయ అధికారి

పెనుమూరు(చిత్తూరు అగ్రికల్చర్): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయ అధికారి సుబ్రమణ్యం అన్నారు. గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి శిక్షణా తరగతుల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆదివారం ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ వేసవి శిబిరంలో విద్యార్థులు అనేక విషయాలపై నైపుణ్యం పెంపొందించుకున్నారని తెలిపారు. ఇలాంటి శిబిరాలు విద్యార్థులకు భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడతాయన్నారు. శిక్షణా కార్యక్రమంలో నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, 30 మందికి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీహరి, శిక్షణా అధికారి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత రాయలసీమ లయన్స్

తిరుపతి తుడా: ఎస్వీ యూనివర్సిటీ, వెటర్నరీ కళాశాల క్రీడా మైదానాల్లో ఆదివారం నిర్వహించిన జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్రస్థాయి జోనల్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో రాయలసీమ లయన్స్ జట్టు విజేతగా నిలిచింది. బహుమతులు ప్రదానోత్సవంలో ఐపీఎస్ అధికారి ఆవుల రమేష్‌రెడ్డి, తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, రమాదేవి ఆసుపత్రి అధినేత డీబీ శశిధర్ రెడ్డి, ప్రెస్ క్లబ్ సెక్రటరీ బాలచంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఉదయం క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్వీ యూనివర్సిటీ వీసీ రాజారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, ఎస్వీయూ పీడీ శివశంకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ టోర్నీలో 13 జిల్లాల నుంచి క్రీడా జర్నలిస్టులు పాల్గొన్నారు. ముందుగా కోస్తా టైగర్స్ జట్టుపై రాయలసీమ లయన్స్ గెలిచి ఫైనల్‌కు చేరింది. అలానే ఉత్తరాంధ్ర వారియర్స్‌పై కృష్ణా గోదావరి (కే జీఎఫ్) ఫైటర్స్ గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్స్‌లో కేజీఎఫ్ ఫైటర్స్‌తో తలపడిన రాయలసీమ లయన్స్ ఘన విజయం సాధించి విన్నర్‌గా నిలిచింది. ఆవుల రమేష్‌రెడ్డి మాట్లాడుతూ తాను జర్నలిస్టు కావాలనుకుని ఐపీఎస్‌కు ఎంపిక అయ్యానని తెలిపారు. ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్‌కు 13 జిల్లాల నుంచి జర్నలిస్టులంతా ఒకే వేదిక పైకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, డీఎంహెచ్ఓ శ్రీహరి, శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


ఆశావర్కర్లతో మాట్లాడుతున్న కోదండయ్య

నగరి: ఆశా వర్కర్లకు జీతాలు పెంచి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. ఆదివారం చిత్తూరు జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు గీత అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వర్కర్లకు నాణ్యమైన యూనిఫాం ఇవ్వాలని, ప్రతి నెలా 5వ తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్కీమ్ వర్కర్లకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు సుజాత, మాధవి, చంద్రకళ, అరాంజి, మమత, కోకిల, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నేడు సాహితీ అవార్డు కార్యక్రమం

చిత్తూరు రూరల్: నగరంలోని ప్రభాగాండ్ఇన్ హోటల్‌లో సోమవారం కుప్పం రెడ్డమ్మ సాహితీ అవార్డు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రామలక్ష్మి తెలిపారు. మధ్యా హ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రచయితలు, సాహితీవేత్తలు పాల్గొనాలని కోరారు.

దళితుల సమస్యలను పరిష్కరించాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సమతా సైనిక్ దళ్ సభ్యులు

చిత్తూరు రూరల్: దళితుల సమస్యలను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర యువత అధ్యక్షుడు సుధాకర్, జిల్లా యువత అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. దళితుల భూ ఆక్రమణలపై రెవెన్యూలో ప్రత్యేక టీంను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. సభ్యులు కిరణ్‌కుమార్, శివలింగం, నరేంద్ర, హరీష్, రాజ, చంద్ర పాల్గొన్నారు.

పొలంలో గుర్తు తెలియని మృతదేహం

చిత్తూరు అర్బన్: చిత్తూరు కట్టమంచి రెడ్డిఅండ్ రెడ్డి కాలనీలోని వ్యవసాయ పొలంలో ఆదివారం గుర్తు తెలియని శవం లభ్యమైంది. మృతదేహం కుళ్లిపోయి.. దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన వ్యక్తికి 45 ఏళ్లు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అనంతరం వారు మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కాగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, మృతుడి వివరాలు తెలిస్తే 9440796705, డయల్ 100కు గానీ ఎవరైనా సమాచారం ఇవ్వాలని వన్‌టౌన్ సీఐ భాస్కర్ పేర్కొన్నారు.

అలరించిన దుర్యోధన వధ


తలపడుతున్న భీమ, దుర్యోధన వేషధారులు

- ముగిసిన మహాభారత ఉత్సవాలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గత 10 రోజులుగా జరుగుతున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధ కార్యక్రమంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. తదుపరి భాగవతారిణి హరికథా కాలక్షేపం జరిగింది. మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తి కట్టించారు. ముందుగా గంగమడుగులో దాక్కున్న దుర్యోధనున్ని భీమసేనుడు లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం ఆహూతులను అలరించింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి ప్రతిమ వద్ద సాగిన భీమ, దుర్యోధన వేషధారుల భీకరపోరు భక్తులను కట్టిపడేసింది. ఇద్దరి మధ్య వీరోచితంగా సాగిన ఈ యుద్ధంలో దుర్యోధనుడు తనువు చాలించాడు. కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం ధర్మరాజుల పట్టాభిషేకం జరిగింది. సాయంత్రం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు కంకణధారులై ఉపవాసాలతో అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు.

'చిదా' మిల్లు అన్యాయంపై ప్రచారం

- యంత్రాలను తరలిస్తే అడ్డుకుంటాం
- కార్మిక సంఘాల హెచ్చరిక


మాట్లాడుతున్న మురగారెడ్డి

పుత్తూరు రూరల్: స్థానిక చిదా స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం కార్మికులకు చేస్తున్న అన్యాయాన్ని వారి స్వరాష్ట్రమైన తమిళనాడులో కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తామని సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి హెచ్చరించారు. పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలంటూ ఆదివారం మిల్లు ముందు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ మిల్లు యాజమాన్యం మొండి వైఖరి వీడి కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం మిల్లును అర్ధాంతరంగా మూసివేసి కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడడం అన్యాయం అన్నారు. 2022 ఫిబ్రవరిలో లేబర్ డిపార్ట్‌మెంట్ సమక్షంలో కార్మిక సంఘ నాయకులు, యాజమాన్యం మధ్య కుదిరిన వేతన ఒప్పందం ప్రకారం నాలుగేళ్ల పాటు మిల్లును యథావిధిగా నడపాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల మధ్య చిచ్చుపెట్టి తమ పబ్బం గడుపుకోవాలని యాజమాన్యం చూస్తోందని ఆరోపించారు. యాజమాన్యం మొండి వైఖరి కారణంగా నేడు 171 మందిని కార్మికులు పనులు లేక రోడ్డున పడ్డారని చెప్పారు. డీసీఎల్ సూచనలను సైతం పట్టించుకోకుండా, చట్టాన్ని ఉల్లంఘిస్తున్న మిల్లు యాజమాన్యం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు రాజేంద్ర, రవిచంద్ర, రామ్మూర్తి, గోవిందరాజు, రఘుపతి, నాగూరు, మాస్కమని తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం కాపు సంఘం అధ్యక్షుడిగా నాగరాజు


నియామక పత్రాన్ని అందజేస్తున్న గోపిరాయల్

శ్రీరంగరాజపురం: రాష్ట్ర కాపు సంఘం అధ్యక్షుడు హరిరామజోగయ్య ఆదేశాలనుసారం మండల నూతన కాపు సంఘ అధ్యక్షుడిగా గంగినేని నాగరాజును నియమించినట్లు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గోపిరాయల్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నూతన మండల కమిటీని నియమించడం జరిగిందని, కాపు సంక్షేమ సేవ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘం ఇచ్చిన బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వహించి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాపు నాయకులు భూపతి, సుబ్బనాయుడు, నారసింహులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి కపిలేశ్వరస్వామి పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 30వ తేదీ నుంచి జూలై 2 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 29వ తేదీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు అంకురార్పణ చేపడతారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక జరిగే దోషాలతో ఆలయ పవిత్రతకు లోపం రానీయకుండా శైవాగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 30న ఉదయం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం కలశ పూజ, హోమం, పవిత్ర ప్రతిష్ట చేస్తారు. జూలై 1వ తేదీ ఉదయం గ్రంథి పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాల పూజ, హోమం చేపడతారు. జూలై 2వ తేదీ ఉదయం మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, పవిత్ర సమర్పణ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు, విఘ్నేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరస్వామికి ఏకాంతంగా ఆస్థానం నిర్వహిస్తారు.